ప్రజాశక్తి
www.prajasakti.com
ఆదివారం 22 జనవరి 2023

'క్యాట్ ఒలంపియాడ్'లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

సత్తా చాటిన విద్యార్థులు

రాయచోటి: స్థానిక శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు క్యాట్ ఒలంపి యాడ్‌లో సత్తాచాటారు. దేశవ్యాప్తంగా క్యాట్ ఒలంపియాడ్ సంస్థ గత ఏడాది నవంబర్ 17న 6-10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒలింపియాడ్ పరీక్షలో తమ పాఠశాల విద్యా ర్థులు సత్తాచాటారని శ్రీ చైతన్య స్కూల్స్ కడప డివిజన్ ఎజిఎండి రమణయ్య ప్రాంతీయసంచాలకులు పి.మహబూబ్ బాష పేర్కొన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ ఏడుగురు విద్యార్థులు నగదు పురస్కారం, 23 మంది మెడల్స్, 32 మంది సర్టి ఫికెట్స్ సాధించారని అన్నారు. శ్రీ చైతన్య మేనేజ్మెంట్ పొందుపరిచిన అకాడమిక్ ప్లాన్ ద్వారా ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపడంవల్లనే ఈ విజయం సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ జి.సుబ్బో, జి వి.శివార్జునరెడ్డి, బి.వి ప్రసన్న కుమారి, కె.రాధిక, కో-ఆర్డినేటర్ కె. కుటుంబరావు, వైస్ ప్రిన్సిపల్స్ కె. జీవానందం, పి.ప్రతాప్ డీన్లు నాగ నరేంద్ర, అల్లాబక్షు, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతి లక్ష్య సాధనకు కృషి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

బ్యాంకర్లు ప్రభుత్వ లక్ష్య సాధన దిశగా పనిచేసి జిల్లా ఆర్థిక ప్రగతిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ గిరీష బ్యాంకు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పిఎంఇజిపి, 6వ విడత జగనన్నతోడు లబ్ధిదారులకు రుణాలు మంజూరుపై కలెక్టర్ బ్యాంకర్లుతో డిసిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్నతోడు పథకంలో భాగంగా వీధుల్లో చిరు వ్యాపారులు, చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి పెట్టుబడి కింద బ్యాంకుల ద్వారా రూ.10 వేలు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు. జగనన్న తోడు పథకంలో వచ్చే దరఖాస్తులను బ్యాంకులు వీలైనంత త్వరగా పరిష్కరించి, మీకు ఇచ్చిన రుణ లక్ష్యాలు సాధించాలన్నారు. జగనన్నతోడు 6వ విడతకు సంబంధించి జిల్లాలో అర్బన్ ప్రాంతాలలో 3230 మంది, రూరల్ ప్రాంతాలలో 11,950 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు రుణాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలోని వివిధ బ్యాంక్ మేనేజర్లు మీకు ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. జగనన్నతోడు పథకంలో రుణం పొంది సకాలంలో చెల్లించిన వారికి అదనంగా వెయ్యి రూపాయల వరకు రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. అవకాశం ఉంటే వీలైనంత ఎక్కువ మందికి రుణాలు ఇవ్వాలన్నారు. జగనన్నతోడు ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ద ృష్టి సారించిందని ఈ పథకానికి సంబంధించి వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ రుణాలను మంజూరు చేయాలన్నారు. పిఎంఇజిపి పథకంలో భాగంగా జిల్లాలో జగనన్న హౌసింగ్ ఇల్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా పూర్తి చేసేందుకు సెంట్రింగ్ చేసే వారికి మండలానికి ఒకరికి తప్పకుండా రూ.10 లక్షలు రుణం ఇవ్వాలని బ్యాంకర్లను కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు సంబంధించి ప్రతి మండలంలో సెంట్రింగ్‌లో నైపుణ్యం ఉన్న వారిని మండలానికి ముగ్గురు చొప్పున గుర్తించి వారి వివరాలను తమకు పంపాలని హౌసింగ్ పీడీకి సూచించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా జిల్లాకు సంబంధించిన అన్ని బ్యాంకులు కనీసం ఐదు రుణాలు తప్పనిసరిగా అర్హులకు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పేదలకు ఇళ్ళు పథకంలో భాగంగా గృహ నిర్మాణం కోసం అదనంగా రుణాలు అవసరమైన మహిళలకు రుణ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. లబ్ధిదారులందరికి హౌసింగ్ లోన్లు మంజూరు చేసి త్వరితగతిన ఇల్ల నిర్మాణాల పూర్తికి సహకరించాలన్నారు. రుణ ప్రణాళికలో నిర్ధేశించిన మేరకు ఆయా రంగాలకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసేందుకు బ్యాం కర్లు సహకరించి అన్నమయ్య జిల్లాను అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వర రెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజ, డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కరువు : ఐద్వా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారత దేశంలో మహిళలకు రక్షణ లేదని, లైంగిక వేధింపులను అరికట్టలేని ప్రభుత్వాలు గద్దెదిగాలని ఐద్వా పట్టణ కార్యదర్శి భాగ్యమ్మ డిమాండ్ చేశారు. ఢిల్లీలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక విజయనగర్ కాలనీలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన సంఘటన దేశానికే మాయనిమచ్చని, కేంద్ర మంత్రి ఆధ్వర్యంలోని అక్కడి పోలీసులు, కేంద్ర ప్రభుత్వం మహిళలను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. మహిళా రెజ్లర్లపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఆపాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు హరిశర్మ మాట్లాడుతూ దేశం తరుపున అనేక క్రీడల్లో పాల్గొని పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు రోడ్డుపై ధర్నా చేస్తున్నారంటే మహిళల రక్షణ పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి తెలిసిపోతుందన్నారు. బిజెపి ఎంపీ బృజ్భూషణ్ ఆగడాలను అరికట్టాలని, వెంటనే అయన్ను అరెస్టు చేయాలని కోరారు. పతకాలు సాధించి మనదేశ గౌరవాన్ని నిలబెట్టిన మహిళల కు మనం ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అదేవిధంగా ఢిల్లీ మహిళ కమిషన్ చైర్‌పర్సన్ స్వాతిపై జరిగిన దాడిని ఖండించారు. దోషులను వెంటనే శిక్షించకపోతే ఆందోళన ఉధృతంచేస్తామన్నారు. ఈ నిరసనలో విజయనగర్ ఐద్వా నాయకులు రెడ్డిప్రసన్న, కృష్ణప్రియ, తెహరున్నిసా, సరస్వతి మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

'ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు తీర్చాలి'

మాట్లాడుతున్న ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు ప్రభుత్వమే తీర్చాలని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ అన్నారు. శనివారం ఎన్జీవోహోంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉద్యోగులకు రావాల్సిన డిమాండ్ల సాధన కోసం 72 సంవత్సరాల నుంచి సుదీర్ఘంగా పోరాడుతోందని చెప్పారు. ఇంతవరకు 11పిఆర్‌సిలు సాధించి అనేక రాయితీలు పొందామని పేర్కొన్నారు. 12వ పిఆర్‌సి సాధన కోసం అందరూ కలిసి పోరాడే సమయంలో గవర్నర్‌ను కలవడం వల్ల ఉద్యోగులు ఆందోళనకు గురవుతారని ఇది మంచి పద్ధతి కాదని ఉద్యోగులకు రావాల్సిన డిమాండ్స్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి కెవి శివారెడ్డితో చెప్పామని తెలిపారు. సూర్యనారాయణ సంక్రాంతి తోపా, దసరా తోఫా, రంజాన్ తోపా అని అనడం దారుణం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్జీవో హోమ్‌పైనా, సంఘాలపైనా మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో రాయచోటి అధ్యక్షులు ఎం. వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి డి.వెంకటేశ్వర్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు కె బలరామరాజు, రాయచోటి కోశాధికారి నాగరాజు, ఉపాధ్యక్షులు మహమ్మద్ బాషా, మణికంఠ, జాయింట్ సక్రటరీ రామ్మూర్తి, మాధవ, ప్రతిభ కుమారి, వరలక్ష్మి, ఆర్గనైజేషన్ కార్యదర్శి పద్మజా పాల్గొన్నారు.

ఫలహారం!

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారం గుట్టుచప్పుడుగా సాగుతోంది. కేవలం వారం రోజుల వ్యవ.లో కడప జిల్లాలో బద్వేల్, అన్నమయ్య జిల్లాలో మదనపల్లి ప్రాంతాల్లో పెద్దఎత్తున పక్కదారి పట్టిన ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది కిందట నుంచి గట్టిగా నిఘా ఉంచడంతో పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టడానికి అవకాశం లేకుండా పోయింది. 2024 సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ రాష్ట్రప్రభుత్వ నిఘా సడలిపోతోంది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాల నుంచి పిడిఎస్ బియ్యం ఇతర రాష్ట్రాలకు యథేచ్ఛగా ఎగుమతి అవుతున్నాయి. జిల్లాల్లోని కొందరు డీలర్లు, ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ల నుంచి మిల్లర్ల దగ్గరకు యథేచ్ఛగా వెళ్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి కడప జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు, బద్వేల్, రాయచోటి, రాజంపేట ప్రాంతాల్లోని కొందరు డీలర్లు నేరుగా మిల్లర్లకు తరలించి నూకలుగా మార్చి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. చౌకబియ్యం డీలర్లు తూకంలో తేడా చూపిస్తూ ఒక్కో వినియోగదారు నుంచి కనీసం కిలో చొప్పున తగ్గిస్తూ, ఆమేరకు డీలర్లు మిల్లర్ల చెంతకు చేర్చు తున్నారనే విమర్శలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇటు వంటి దురాగతానికి బ్రేక్ పడాలంటే తూనికలు, కొలతలశాఖ అధికారులు దాడులు ముమ్మరం చేస్తేనే కొంత మేరకు వినియోగదారులకు ఊరట లభించే అవకాశం ఉంది. లేనిపక్షంలో అక్రమ రవాణా అంతు లేకుండా సాగుతూనే ఉంటుందనడంలో సందేహం లేదు. వారం రోజుల్లో కడప నగరంలో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా దారులను పోలీసులు అదుపులోకి తీసుకుని విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా బద్వేల్ పట్టణంలో చౌక బియ్యంతో కూడిన లారీని బద్వేల్ ఆర్డీఓ అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించడం సంచలనంగా మారింది. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో రూ.4.60 కోట్ల విలువైన చౌకబియ్యం పట్టుబడడం తెలిసిందే. అంతకు ముందు కడప నగరంలో పెద్దఎత్తున పోలీసులు బియ్యం అక్రమార్కులను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. కేవలం 10 రోజుల వ్యవధిలోని కడప, అన్నమయ్య జిల్లాల్లో పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా కావడం చర్చనీయాంశంగా మారింది. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వారం రోజుల వ్యవధిలో రెండు, మూడు ఘటనలు బయటపడితే, బయటపడకుండా ఇంకెన్ని లారీల చౌకబియ్యం ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా అయ్యాయో ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఏడాది కిందటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని నిఘా విభాగాల పరిధిలో ఉన్న అక్రమార్కులు ఒక్కసారిగా రెక్కలు విప్పుకుని విరుచుపడడం వెనుక మతలబేమిటో తెలియడం లేదు. పిడిఎస్ బియ్యం అక్రమార్కుల వెనుక ప్రజాప్రతినిధుల అండదండల హస్తం ఉందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్రప్రభుత్వ పరిధిలోని నిఘా విభాగాలను మరింత పటిష్టం చేసి, పేదల బియ్యాన్ని అక్రమార్కుల బారి నుంచి కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడపప్రతినిధి

సదస్సులో మాట్లాడుతున్న సంధ్యారాణి

చట్టాలపై అవగాహన అవసరం : జడ్జి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చట్టాలపైన ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి తెలిపారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో శనివారం కొత్త బోయినపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ చట్టాలపైన ప్రతి పౌరుడికి సరైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. బాల్యవివాహాల నిర్మూలన, చిన్న పిల్లల సంరక్షణ తదితర అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 18 నెలల అయేషా అనే చిన్నారికి బిఎంఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో శనివారం అందజేశారు. అయేషా కొన్ని రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధ పడుతూ బెంగుళూరు సెయింట్ జాన్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. తల్లిదండ్రుల ద్వారా విషయం తెలుసుకున్న చారిటబుల్ చైర్మన్ కె. మహ్మద్‌రఫిక్ వెంటనే స్పందించి సభ్యుడు సయ్యద్ అహ్మద్ ద్వారా బాధితురాలి కుటుంబానికి ఆర్థిక సాయంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

ఆర్థిక సాయమందిస్తున్న దాత

శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ లక్ష్మణరావు
- రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించి పాటించి అభివృద్ధి చెందాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ, జెవివి నాయకులు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కడప నగరంలోని జయరాజు గార్డెన్స్‌లో నిర్వహించారు. జాతీయ జెండాను ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జెవివి జెండాను నిట్ మాజీ ప్రొఫెసర్ రామ చంద్రయ్య ఆవిష్కరించి కార్యక్రమం ప్రారంభించారు. 20 జిల్లాల నుంచి 41 టీములు, 150 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సైంటిస్టులు హాజరయ్యారు. ప్రారంభ సమావేశానికి జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వందల సంవత్సరాలు గడిచి పోవుతున్నా ఇప్పటికీ ఏ జంతువూ మాట్లాడలేదు, కేవలం మనిషి మాత్రమే మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. అంటే మనిషి మెదడు మాత్రమే అభివృద్ధి చెందిందని, ఇంకా అభివృద్ధి అవుతుందని తెలిపారు. క్రమంలో శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించడం, పాటించడం, అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. పిల్లల్లో సైంటిఫిక్ టెంపర్ పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక 30 సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తోందని తెలిపారు. నిట్ మాజీ ప్రొఫెసర్ రామచంద్రయ్య మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సి.వి.రామన్, సైన్స్ దినోత్సవం గురించి, డిసెంబర్ 10 నోబుల్ బహుమతి గురించి పిల్లలకు వివరించారు. పరమాణువులు, కణాలు, ప్రోటాన్ల గురించి, క్లిక్స్ కెమిస్ట్రీ గురించి వివరించారు. తెలంగాణ జెవివి అధ్యక్షులు కోయ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేవుడు అనే భావన, పుట్టుక గురించి వివరించారు. షార్ డిజిఎం బాలమురళీ మాట్లాడుతూ పిల్లలలో స్పేస్ గురించి అవగాహన కలిగించడం కోసం అనేక పరికరాలు తెచ్చి ఎగ్జిబిషన్ పెట్టామని విద్యార్థులు ఉపయోగించుకుని విషయావగహన పొందాలన్నారు. జెవివి రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ ఆ వస్యకతను వివరించారు. కార్యక్రమంలో జెవివి నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు త్రిమూర్తులు, కెఎంఎంఆర్ ప్రసాద్, కుర్రా రామరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాల బయన్న, వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు, రాష్ట్ర చెకుముకి సైన్స్ సంబరాల కార్యదర్శి బాలు, వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.డి.దేవదత్తం, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటరామరాజు, సమతా రాష్ట్ర కమిటీ సభ్యులు సరస్వతి, జిల్లా సమతా కన్వీనర్ పద్మావతి, కార్యదర్శులు సమీర్ బాషా, రంగనాయకులు, అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశరెడ్డి, కోశాధికారి ప్రతాప్ రెడ్డి, జెవివి యూత్ నాయకులు డేవిడ్, రాజశేఖర్, అల్తాఫ్ పాల్గొన్నారు.

సైన్స్ సంబరాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఆకట్టుకున్న షార్ రాకెట్ల ప్రదర్శన

ఆకట్టుకున్న సైన్సు ప్రదర్శన

షార్ నుంచి వచ్చిన సైన్స్ బస్సును సైంటిస్టులు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. పల్లవి, జ్ఞానేశ్వరి ఏర్పాటు చేసిన న్యాచురల్ వేస్ట్ మానేజ్ మెంట్ స్టాల్, శ్రీనివాస్ రెడ్డి చే ఏర్పాటు చేసిన సైన్స్ స్టాల్, బుక్ ఎగ్జిబిషన్ మరికొన్ని స్టాల్స్‌ను పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం సైన్స్ క్విజ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రమేష్‌రెడ్డి

అరాచక ప్రభుత్వాన్ని తరిమికొడదాం : ఆర్‌ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో అవినీతి, అరాచక, ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని తరిమికొట్టి, 2024లో ప్రజా సంక్షేమానికి పాటుపడే టిడిపి ప్రభుత్వాన్ని తెచ్చుకుందామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇదేం ఖర్మ మన రాష్టానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, అరాచకాల గురించి ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వంలో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాల జీవనం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష , పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్ వలీ, రాజంపేట పార్లమెంట్ కార్యదర్శి వతన్ నిస్సార్, పట్టణ మైనార్టీ అధ్యక్షులు అతావుల్లా, రాయచోటి నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ వతన్ సలీమ్, ఎద్దుల లక్ష్మీ ప్రసాద్, సాయి ప్రతాప్, రెహ్మాన్, అత్తర్ జావిద్, శేషిజాబీర్, సోనిరాజ్ కలీమ్, సత్యరెడ్డి, సయ్యద్, మహమ్మద్ జాఫర్, మాజీ కాన్సలర్ మహేబూబ్ బాష, మాజీ కౌన్సిలర్ మస్తాన్, ఇలియాజ్, రజక సంఘ కార్యదర్శి శ్రీనివాసులు, మహబూబ్‌బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల సేమియా బాలుడికి రక్తదానం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

చిన్నమండెం మండలానికి చెందిన నూర్ మొహమ్మద్ అనే బాలుడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి 20 రోజులకు ఒకసారి (బిప్లస్) రక్తం ఎక్కించాల్సి ఉంది. ఇందులో భాగంగానే హీబా బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు హఠాన్ మహమ్మద్ అలీ వెంటనే స్పందించి మోఫిజ్ అనే యువకుడి చేత దీప బ్లడ్ సెంటర్ నందు రక్తదానం చేయించి తల సేమియా బాలుడికి అందించారు. దీంతో బాలుడి బంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉస్మాన్, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

30 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణపరిధిలోని ఐకె పాఠశాలలో జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ -2023 పోటీలు ఈనెల 30 నుంచి నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలలో చదివే 6 నుండి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులు కబడ్డీ పోటీలలో పాల్గొనవచ్చు అన్నారు. ప్రోగ్రామ్ ఆర్గనైజర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ 30న బాలురకు, 31న బాలికలకు పోటీలు నిర్వహించి వీటిలో ప్రతిభ చూపిన బాలురు, బాలికలకు ఫిబ్రవరి 1న ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పాల్గొనే పాఠశాల టీములు ముందుగా 6281453550లో రిజిస్టర్ చేసుకోవాలని చెప్పారు. ఎలంటి ఎంట్రీ ఫీజు లేదని అన్నారు. పోటీలలో పాల్గొనే విద్యార్థిని విద్యార్థులకు వసతి, భోజనం ఉచితంగా కల్పిస్తామని తెలిపారు. అవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సురేంద్ర, రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జీవిత చరిత్ర వారి బోధనలు ఆధారంగా రూపొందించిన 'సంఘం శరణం గచ్ఛామి' పోస్టర్‌ను కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ పెంచలయ్య, కో - కన్వీనర్ డి.సి. వెంకటయ్య శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర గురించి ఈనెల 25వన గఫార్ ఫంక్షన్ హాల్‌లో సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపకం నిర్వహిస్తున్నామని సామాజిక సంఘాలు, ఉద్యోగులు, విద్యార్థులు మేధావులు, అభ్యుదయవాదులు, స్థానిక ప్రజానికం అందరూ హాజరై తిలకించాలని పేర్కొన్నారు. రాజ్యాంగం కుల, మత విభేదాలతో సంబంధం లేకుండా లౌకిక విధానాన్ని రాజ్యాంగం ప్రసాదించిందని రాజ్యాంగ స్పూర్తికి నేడు తూట్లు పొడుస్తున్నారని వాపోయారు. ప్రతి ఒక్కరూ వీక్షించి ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు ఎం.మణి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఫిబ్రవరి 11వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా మూడవ అదనపు జడ్జి మురళీకృష్ణ అన్నారు. శనివారం మూడవ అదనపు జిల్లా కోర్టులో డిఎస్‌పి శివ భాస్కర్ రెడ్డి, సివిల్ జడ్జి సంధ్యారాణి, పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రాజీ మార్గమే రాచ మార్గమన్నారు. రానున్న మెగా లోక్ అదాలత్‌లో పరిష్కరించదగిన అన్ని కేసులను కక్షిదారులతో చర్చించి పరిష్కరించే విధంగా చూడాలని ఆదేశించారు. కేసులు సత్వర పరిష్కారం అయ్యేందుకు కావలసిన సూచనలు, సలహాలు అందజేశారు. ఈ లోక్ అదాలత్ నందు వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అవ్వాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు.

వైభవంగా హసన్ దాదా ఉరుసు

దర్గాకు తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లాలో ప్రసిద్ధి చెందిన హసన్ దాదావలి ఉరుసు వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతి కగా నిలిచే ఈ ఉత్సవాలను తిలకించడానికి రాష్ట్ర నలు మూలల నుంచే గాక పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హసన్ దాదా వలిను దర్శించుకుని మొక్కుబడులను తీర్చుకున్నారు. గంధాన్ని కెఎస్ఎసిబి షాద్ బాబా సాహెబ్, కెఎస్‌సిబి నూర్ బాబా సాహెబ్ గంధాన్ని పుర వీధుల గుండా ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. ఈ సమయంలో భక్తులు ప్రదర్శించిన కర్రసాము విన్యాసాలు, నృత్యాలు, ఇతర కార్యక్రమాలు అమతంగా ఆకట్టుకున్నాయి. దర్గా చైర్మన్ మొహమ్మద్ షరీఫ్,వైస్ చైర్మన్ అన్నయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అర్బన్ సిఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐలు మొహమ్మద్ రఫీ, నరసింహ రెడ్డి పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఉరుసులో పాల్గొని పాటలు పాడుతున్న పకీర్లు

మహిళా సంఘాలకు నాటుకోళ్లను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ లీలామాధవి

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగాలని ఎంపిడిఒ లీలామాధవి అన్నారు. శనివారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల వైసిపి ఇన్‌ఛార్జ్ ఆర్‌వి.రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డిలతో కలిసి మహిళా సంఘాలకు నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుచుకోవటానికి, ఆర్థికంగా నిలబడటానికి ప్రభుత్వం నాటు కోళ్లను సాధారణ ధరలకు అందించినట్లు తెలిపారు. మండలానికి 1100 నాటు కోళ్లు రాగా, ఒక్కొక్క మహిళా సంఘానికి 11 నాటు కోళ్లను రూ.3,200 లకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నాటు కోళ్లను మహిళలు పెంచుకొని వాటి ద్వారా వచ్చే ఆదాయంతో ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం రెడ్డెప్ప, వైసిపి నాయకులు శేఖర్ రెడ్డి, గంగాధర, సిసిలు భారతి, శివారెడ్డి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి-కలకడ

జగనన్న కాలనీల్లో ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ సూచించారు. శనివారం మండలంలోని బాటవారిపల్లి సచివాలయ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని, నీటి సమస్యను కూడా త్వరగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని, ఇళ్ల నిర్మాణ పనులు మాత్రం త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జనార్ధన, ఇంజనీరింగ్ అసిస్టెంట్ చరిష్మాంజలి, వెలుగు సిసి, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మృతుడి భార్య హేమలతకు తక్షణ సాయం అందిస్తున్న అధికారులు

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పిటిఎం మండలపరిధిలోని పట్టెంవాండ్లపల్లె పంచాయతీ, మొరుసుపల్లెకు చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వైఎస్ఆర్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతుడి భార్య హేమలతకు అంద జేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ నరసమ్మ, నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిరుపేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం కింద దాదాపు మూడు వేల జబ్బులకు ఉచితంగా వైద్యం అందజేస్తున్నారని కొనియా డారు. పేదప్రజలు ఎవరైనా వ్యాధుల బారినపడి మరణిస్తే వారికి వైఎస్ఆర్ బీమాపథకం ద్వారా ఆర్థికసాయం అందజేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి నిరంతరం ప్రజా శ్రేయస్సుకు పరితపిస్తున్నారని కితాబునిచ్చారు. కార్యక్రమంలో వెల్ఫేర్‌అసిస్టెంట్ శోభ, టిఎ లక్ష్మణ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ సిఆర్.మంజుల

సామరస్యంగా భూసమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

రైతులు సామరస్యంగా భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దార్ సిఆర్.మంజుల పేర్కొన్నారు. శనివారం తవళంలో భూ రీసర్వేపై గ్రామసభను నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు – భూ రక్ష పథకం కింద తవళం గ్రామాన్ని ఇదివరకే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు కలిసి వివిధ దశల్లో క్షేత్రస్థాయిలో భూమిని, సర్వే నెంబర్ల హద్దులను పరిశీలించి నివేదికలను సిద్ధం చేశారని తెలిపారు. అపోహలు, సమస్యలు ఉన్న రైతులు నేరుగా అధికారులకు సలహాలు. సూచనల మేరకు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని రైతులు వారికి సహకరించాలని కోరారు. భవిష్యత్తులో భూ సమస్యలను శాశ్వతంగా తొలగించడానికి ముఖ్యమంత్రి భూ రీసర్వేను చేపట్టారని తెలిపారు. సమస్యలున్న రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన భూరీసర్వే కార్యక్రమానికి రైతులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, భూరీసర్వే డిటి సిరాజుద్దీన్, ఆర్ఐ రాంప్రసాద్, మండల సర్వే యర్ మురళి, వీఆర్ఓ రామకృష్ణ, వీఆర్ఏలు, సచివాలయ సర్వేయర్లు, వైసిపి నాయకులు రవి, రైతులు పాల్గొన్నారు.

రోగులకు వైద్య సేవలు అందిస్తున్న 104 సిబ్బంది

ప్రజలకు అందుబాటులో 104 వైద్య సేవలు

ప్రజాశక్తి-నందలూరు

పేద ప్రజలకు అందుబాటులో 104 వైద్యసేవలను ప్రభుత్వం అందిస్తోందని డాక్టర్ సృజన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మెరుగైన వైద్యం నోచుకోని వారికి కూడా 104 వాహనం ద్వారా గ్రామాల్లోని ప్రజల ఇంటి వద్దకే వెళ్లి అనారోగ్యంతో వున్నవారికి వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. రోగికి చికిత్సతో పాటు మందులను పంపిణీ చేసి ఆరోగ్య సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సచివాలయానికి నెలకు రెండుసార్లు 104 వాహనం అందుబాటులో ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డేటాఎంట్రీ ఆపరేటర్ గోవర్దన్, హెల్త్ అసిస్టెంట్లు లక్ష్మయ్య, సులోచన, ఎంఎల్‌హెచ్‌పి సుజాత, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు శివకోటి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన జడ్జి

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని శనివారం జూనియర్ సివిల్ జడ్జి కె.లత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవంబర్ 5న, ఎనిమిదవ తరగతి విద్యార్థినీ పాఠశాల నందు భోజనం బాగాలేదని ఫిర్యాదు చేయగా ఆ ఫిర్యాదు పిఎల్‌సి నెంబర్ 48/2022 గా నమోదు చేశామని అన్నారు. అధికారులందరికీ పాఠశాలలు తనిఖీ చేసి రిపోర్ట్ ఇవ్వమని ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అధికారులు పాఠశాలలు తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనంలో ఉన్న లోటు పాట్లను సర్దుబాటు చేసి కోర్టు నందు రిపోర్టు ఫైల్ చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం భోజనాన్ని మెనూ ప్రకారం భోజనం ఉందా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. రిజిస్టర్‌ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం కరివేపాకు రైస్, చక్కెర పొంగలి, పప్పు, పులుసు బాగా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలతో మాట్లాడుతూ మీకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

మధ్యాహ్న భోజన మెనూను పరిశీలిస్తున్న జడ్జి లత

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రహీముల్లా

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

వీరబల్లి : వాహనదారులు రోడ్డు నియమాలను పాటించకపోతే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని వీరబల్లి ఎస్ఐ రహీముల్లా, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, వాహనదారులను హెచ్చరించారు. శనివారం స్థానిక బస్టాండ్ దగ్గర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఆటోలలో ప్రయాణి కులను పరిమితికి మించి ఎక్కించుకోరాదని సూచించారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుంటే జరిమానా విధిస్తామని చెప్పారు. మద్యం సేవించి వాహ నాలు నడప రాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రహీముల్లా, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **పీలేరు :** వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పీలేరు అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి, ఎస్ఐ నరసింహుడు తెలిపారు. 34వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆటో, కారు, లారీ ఇతర వాహన చోదకులకు వాహన ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో మనకు ఏకాగ్రత చాలా అవసరమని అన్నారు. ప్రశాంతమైన ఏకాగ్రతతో వాహ నాలను నడపాలని తెలిపారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లో మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదమని హెచ్చరిం చారు. డ్రైవర్లు తమపై తమ కుటుంబమే కాకుండా ప్రయాణీకుల జీవితాలు, వారి కుటుంబాలకూడా ఆధారపడి ఉన్నాయన్న విషయాన్ని గమనంలో ఉంచుకుని వాహనాలను నడపాలని సూచించారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఈ ఏడాది పదిహేడు వందల రోడ్డు ప్రమాదాలు జరిగాయని, ఎందరో వాహన చోదకుల కుటుంబాలు ఆదరించే వారు లేక రోడ్డున పడ్డాయన్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎఎస్ఐ హేమసుందర్, హెడ్ కానిస్టేబుల్ విజయ్ కుమార్, ఆదినారాయణ, కానిస్టేబుళ్ళు ఆనంద, ధనుంజయ, శివ, ఆటో యూనియన్ లీడర్ బోదేష, పలువురు వాహన చోదకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన విద్యార్థి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

రాష్ట్రస్థాయి ఆటల పోటీలలో తంబళ్లపల్లి గిరిజనబాలుర రెసిడెన్షియల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థి సుదర్శన్‌నాయక్ ప్రతిభ చాటాడు. శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ అండర్–19 హై జంప్1.73 మీటర్ల పందెంలో ప్రతిభ చాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు పిఇటి దేశముఖ్ సజావుద్దీన్ తెలిపారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి చేరిన ఆ విద్యార్థిని ఎంఇఒ త్యాగరాజు, తహశీల్దార్ కళావతి, ఎంపిడిఒ ఆనంద్ కుమార్‌లు అభినందించారు.

ఆరవ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆరవతరగతిలో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి త్యాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 3,4తరగతులు పూర్తిగా చదివి ఉత్తీర్ణులై ఉండాలన్నారు.అదేవిధంగా 01–05–2011నుంచి 30–04–2013ల మధ్య జన్మించిన అభ్యర్థులు అర్హులని, తాము నివసిస్తున్న జిల్లాలో 2022–23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుండి గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు, బాలికలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, దివ్యాంగ పిల్లలకు రిజర్వేషన్ సౌకర్యం కలదని తెలిపారు.అర్హులైన ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకోవడం కోసమే ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ప్రవేశపెట్టిందని కలిచెర్ల సర్పంచ్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం కలిచెర్ల గ్రామ సచివాలయంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం శేఖర్ మాట్లాడుతూ పాడి రైతులకు గిట్టు బాటు ధర కల్పించడం కోసం అమూల్య డెయిరీ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రాములోను సంఘాలు ఏర్పాటు చేసి సంఘాల ద్వారా పాలసేకరణ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి పూర్ణచంద్రిక రమేష్ , పంచాయతీ కార్యదర్శి ఖాదర్ బాషా, బాలాజీ, సంగమిత్రలు రాజగోపాల్, అమరావతి, అమూల్య రూట్ సూపర్వైజర్ షమీవుల్లాభాను, సచివాలయ సిబ్బంది బాలాజీ నాయిక్, వాలంటీర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారాలీగల్ వాలంటీర్ల పోస్టులకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పారా లీగల్ వాలంటీర్స్‌గా పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాసంఘం అధ్యక్షులు, స్థానిక ఇన్‌ఛార్జ్ న్యాయమూర్తి ఆసిఫా సుల్తానా ఒక ప్రకటనలో కోరారు. పదవ తరగతి పాసైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 25 పారా లీగల్ వాలంటీర్ల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పనిచేసిన రోజుకి నిర్ణయించబడిన వేతనం ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుట్టుచప్పుడు కాకుండా చేపల చెరువులకు వేలం

ప్రజాశక్తి - రామసముద్రం

మండలంలోని కాప్పల్లిపంచాయతీ పరిధిలో శుక్రవారం చేపల చెరువులకు వేలంపాటను గుట్టుచప్పుడు కాకుండా సంబంధిత అధికారులు నిర్వహించారు. పంచాయతీ ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా పక్కమండలాల వ్యక్తులకు తూతూ మంత్రంగా మార్కెట్ విలువ నిర్ణయించి ముట్టకట్టారనే విమర్శలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వేలంపాట నిర్వహించి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేలంపాట రద్దు చేసి, దండోరా ద్వారా ప్రజలకు తెలియచేసి నిబంధనల మేరకు వేలంపాట నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

గర్భిణుల సంరక్షణే ధ్యేయం

ప్రజాశక్తి-పీలేరు

హైరిస్క్ గర్భిణుల సంరక్షణే తమ లక్ష్యమని తలుపుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శుక్రవారం తలుపుల పిహెచ్‌సి పరిధిలోని తలుపుల, బయ్యారెడ్డిగారిపల్లి గ్రామాల్లో హై రిస్క్ గర్భిణి మహిళలకు ఇంటింటి ఆరోగ్య సేవలు కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైరిస్క్ తల్లి నుండి హైరిస్క్ శిశువు కాకుండా ఆరోగ్యవంతమైన శిశువు జన్మించడం సాధ్యమని చెప్పారు. అందుకు ప్రతి గర్భిణి స్త్రీకి నిర్దేశిత సమయంలో ఉచిత ఆరోగ్య సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శస్త్ర చికిత్సలతో పాటు ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు కూడా ఉచితమని తెలిపారు. శిశువు తల్లి గర్భములో ఉండగా తల్లికి వుండే జబ్బులు బిడ్డకు సోకి తల్లికి, బిడ్డ మరణాలు సంభవించే ప్రమాదముందని హెచ్చరించారు. అందుకు ప్రతి గర్భిణి వైద్యసేవలపై అవగాహన కలిగివుంటే తల్లితో పాటు బిడ్డా సురక్షితమని చెప్పారు. రాను పోను తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్, 108 అంబులెన్స్ ద్వారా ఉచిత ప్రయాణ సేవలు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పిహెచ్‌ఎన్ వెంకటసుబ్బమ్మ, పర్యవేక్షకులు కృష్ణయ్య, ఎఎన్‌ఎంనాగవేణి, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే అభివృద్ధి చూస్తారు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేనాని పవన్ కళ్యాణ్‌కు ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని అభివృద్ధి ఏంటో చేసి చూపిస్తామని జనసేన నాయకులు అన్నారు. శనివారం పవనన్న ప్రజాబాట 52వ రోజు కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పరిధిలోని ఊటుకూరు, కొండ్లోపల్లె, గాలివారిపల్లె, సున్నపురాళ్లపల్లె తదితర గ్రామాలలో పర్యటించారు. జనసేన మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను గడప–గడపకూ తిరిగి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ రాజకీయాలలోనూ, పాలకులలోను మార్పు రావాలని తెలిపారు. రాజకీయరంగంలో నేటి వరకు పేరుకుపోయిన కుళ్ళు, కుతంత్రాలను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రవేశం చేశారని తెలిపారు. అటువంటి నిబద్ధత కలిగిన వ్యక్తికి ముఖ్యమంత్రిగా ఒక్కసారి అవకాశం ఇచ్చి చూడాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జనసేన వీర మహిళలు జడ్డా శిరీష, రేవతి, ప్రమీల, సరోజమ్మ, నాయకులు తాళ్లపాక శంకరయ్య, నరసింహులు, అంజి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

జాతీయ స్కే ఛాంపియన్‌షిప్‌లో 'ఆదిత్య' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జాతీయ స్కే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ రెండవ సంవత్సరం సిఇసి విభాగానికి చెందిన విద్యార్థిని బి.యశశ్విని ప్రతిభ చూపినట్లు కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. జమ్మూ కాశ్మీర్ అసోసియేషన్‌లో జరిగిన పోటీలలో వివిధ రాష్ట్రాల నుండి ఆటగాళ్లు పాల్గొన్నారన్నారు. తమ కళాశాల విద్యార్థి పాల్గొని మూడవ బహుమతిని గెలుపొందినట్లు తెలిపారు.గెలుపొందిన విద్యార్థిని రామలింగారెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబులు అభినందించినారు. విద్యతోపాటు అన్ని రంగాలలోనూ విద్యార్థులు రాణించాలని ప్రోత్సహించారు.

'ఉద్యోగుల డిమాండ్లు గవర్నర్ తీరుస్తారా'

కడప అర్బన్ :ఉద్యోగుల డిమాండ్లు గవర్నర్ తీరుస్తారా అని ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులు, రవికుమార్ ప్రశ్నిం చారు. శనివారం ఎన్‌జిఒ హోమ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌జిఒ అసోసియేషన్ ఉద్యోగులకు రావాల్సిన డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్నామని చెప్పారు. పెండింగ్ డిమాండ్లు సాధించామే తప్ప ఎవరినీ దూషించ లేదని పేర్కొన్నారు. సూర్యనారాయణ సంఘాలను నాయకులను విమర్శించడం తగదన్నారు. ద్యోగులను మభ్య పెట్టడానికే గవర్నర్‌ని కలిశారని ఆరోపించారు. కార్యక్రమంలో సహ అధ్యక్షులు టి.తిమారెడ్డి, ఉపాధ్యక్షులు బాలపులయ్య, జాయింట్ సెక్రటరీ ఎన్. రాజశేఖర్,సిటీ అధ్యక్షులు కె.చినయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, సహాధ్యక్షులు శ్రీనివాసన్,కోశాదికారి నాగార్జున, సంయుక్త కార్యదర్శి పద్మనాభం, రాష్ట్ర కౌన్సెలర్ గౌస్ మోదీన్ పాల్గొన్నారు.

జిఒ-1ని ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒనంబర్ ఒకటిని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.ఆర్.నాయక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయం ఆవరణలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల గొంతు కులను నొక్కే విధంగా జిఒను తెచ్చిందని చెప్పారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తి విరుద్ధం అన్నారు. విభజన హామీలు అమలు కోసం విద్యార్థి, యువ జన సంఘాల అధ్వర్యంలో బస్సు జాతా తలపెడితే దానికి కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వకుండా అడ్డుకుందని వాపోయారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళితే అక్కడ రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు తగిలిందని తెలిపారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్‌నాయక్, పవన్ కళ్యాణ్‌పాల్గొన్నారు.

బ్యాంకు సిబ్బందికి సూచనలు,సలహాలు ఇస్తున్న ఆర్ఎం రాంప్రసాద్

యూనియన్ బ్యాంకును సందర్శించిన ఆర్ఎం

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ యూనియన్ బ్యాంకును తిరుపతి పట్టణానికి చెందిన యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ రాంప్రసాద్ శనివారం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్‌ను నూతన భవనంలోకి మార్చాలన్న ఉద్దేశ్యంతో కలకడకు వచ్చిందన్నారు. నూతనంగా నిర్వహిస్తున్న భవనాన్ని తనిఖీ నిర్వహించి, అందులో మౌలిక వసతులపై ఆరా తీసి సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. బ్యాంక్ సిబ్బందితో మాట్లాడుతూ సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని చెప్పారు. బ్యాంకుకు వచ్చే లబ్ధిదారులతో సానుకూలంగా మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి పనులు చేసి పంపించాలన్నారు. బ్యాంకుసిబ్బంది పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. రీజనల్‌మేనేజర్‌ను బ్యాంకు సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎంజి దయాకర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ సెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకు

కలికిరి : ఎపి ఉన్నతవిద్యామండలి, యోగివేమన యూనివర్సిటి సంయు క్తంగా నిర్వహించిన పీజీ సెట్ పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో పత్తేగడగ్రామం కొట్టాలకు చెందిన పెనుబాకు సహాదేవయ్య, గంగాదేవి దంపతుల కుమారుడు పెనుబాకు సోమశేఖర్ పొలిటికల్ సైన్స్ సబ్జెక్ట్ విభా గంలో రాష్ట్రస్థాయిలో జనరల్ విభాగంలో 36వ ర్యాంకు, రిజర్వేషన్ విభాగంలో 5వ ర్యాంకు సాధించాడు. తమ కుమారుడికి రాష్ట్ర వ్యాప్తంగా ఉత్తమ ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ చాటిన సోమశేఖర్‌ను రచయిత జరుగుమల్లి వీరయ్య, గ్రామస్తులు అభినందించారు.

పిల్లలతో ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ రాజేశ్వరి

ఆడపిల్లల చదువు దేశానికే గర్వకారణం

రైల్వేకోడూరు : ఆడపిల్లలను బ్రతకనించి చదవనిస్తే దేశానికే గర్వకారణంగా నిలుస్తారని ఐసిడిఎస్ సిడిపిఒ రాజేశ్వరి తెలిపారు. శనివారం వెంకటరెడ్డిపల్లి అంగన్వాడీ కేంద్రంలో భేటీ బచావో భేటీపడావో కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈనెల 24న జాతీయ బాలికాదినోత్సవం కావడంతో ఈనె18నుండి 24 వరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. చిన్నారులతో కలసి వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 74సంవత్సరాలు కావస్తున్నా ఇంకా ఆడపిల్లల చదువు, రక్షణ గురించి మాట్లాడుకోవడం బాధాకరమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణకోసం అనేక చట్టాలు రూపొందిస్తున్న ఆచరణలో అందుకు విరుద్ధమైన సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. ఆడపిల్ల పుట్టుకనే బాధగా భావించే రోజులు పోవాలని స్త్రీ, పురుష సమానత్వం దిశగా సమాజం అడుగులేయాలని తెలిపారు. ఆర్థిక స్వాతంత్రం స్త్రీ,పురుషులకు సమానంగా ఉన్నప్పుడు కొంతవరకు మహి ళలపై జరిగే హింసను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ రేవతి, సుబ్బ నరసమ్మ, గీత, ఎమ్ఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

25 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

నందలూరు: ఈనెల 25వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు అరవపల్లె జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో ఎమ్మెల్యే మేడా వెంకటమల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనాబ్ ఎస్‌టి ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కరీముల్లా ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, 4వస్థానం రూ.3 వేలు అందిస్తారని తెలిపారు. పాల్గొన్న జట్లకు కన్సోలేషన్ బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల జట్లు ఈనెల 24వ తేది లోపు జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు చేసుకోవడానికి 9000527227 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి సిమెంట్ లారీ బోల్తా

ప్రజాశక్తి-నందలూరు

కడప–చెన్నై జాతీయ రహదారిలోని కన్యకా చెరువు కట్టపై శనివారం తెల్ల వారు జామున 5గంటలకు సిమెంటు లారీ అదుపుతప్పి కన్యకా చెరువ దిగువ భాగంలో బోల్తా పడింది. వివరాల్లోకి వెళితే జమ్మలమడుగు నుండి చిత్తూరుకు సిమెంటులోడుతో వెళ్తున్న ఎపి04 టి డబ్ల్యూ 7661 నెంబర్ గల లారీ బోల్తా పడింది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

కన్యకా చెరువు వద్ద అదుపుతప్పి బోల్తాపడ్డ సిమెంటు లారీ

ఆర్‌టిసి బస్సు, ఆటో ఢీ : డ్రైవర్‌కు గాయాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఆటో డ్రైవర్

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు–చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ వి ఆర్ కాలేజ్ రోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌టిసి బస్సు, ఆటోను ఢీకొని ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథన మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయచోటి పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ ఎపి39టిఇ 8468 నెంబర్ గల ఆటో రామాపురం వైపు నుంచి విఆర్‌కాలేజీ వైపురోడ్డు దాటుతుండగా రాయచోటి డిపోకు చెందిన ఎపి04జడ్ 8468 నెంబర్ గల ఆర్‌టిసి బస్సు రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళుతున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌కు రక్త గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి లక్కిరెడ్డిపల్లి సిఐ వరప్రసాద్ చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తమై 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఆటో డ్రైవర్ వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.